16102024-DIS-04_Layout 1 10/16/2024 4:09 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# కెనడా పెడధోరణి

**భారత్,** కెనడా దేశాల మధ్య దౌత్య సంబంధాలు తీవ్రమైన కుదుపులకు లోనవుతున్నాయి. తాజాగా రెండు దేశాలు దౌత్యాధికారులను బహిష్కరించుకోవడం రెండు దేశాల విభేదాలకు పరాకాష్ఠగా చెప్పవచ్చు. ఖలిస్థాన్ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య ఈ పంచాయతీకి మూల కారణం. నిజ్జర్ హత్య వెనుక 'భారత్ ఏజెంట్ల' పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్టు గత ఏడాది సెప్టెంబర్‌లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించడం దౌత్యపరమైన దుమారాన్ని రేపింది. 'అవి అర్థరహితమైన, దురుద్దేశపూరితమైన ఆరోపణలని' భారత్ అప్పట్లో ఖండించింది. ఇప్పుడు ట్రూడో ఒకడుగు ముందుకువేసి నిజ్జర్ హత్యను భారత ప్రభుత్వమే చేయించిందని, దౌత్యాధికారులు సంధానకర్తలుగా వ్యవహరించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హత్య కేసులో భారత హై కమిషనర్‌ను అనుమానితుడిగా పేర్కొంటూ ఆయన పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్టు ప్రకటించడంపై భారత్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఓట్ల రాజకీయంలో భాగంగానే ఆయన ఈ ఆరోపణలు చేశారని భారత విదేశాంగ శాఖ కొట్టిపారేసింది. అంతేకాదు, కెనడా తీరుకు నిరసనగా హై కమిషనర్‌ను వెనుకకు పిలిపించుకున్నది. 'ఓటు బ్యాంకు' రాజకీయంలో భాగంగానే ఆయన ఈ ఆరోపణలు చేశారని భారత విదేశాంగ శాఖ కొట్టిపారేయడం గమనార్హం.

కెనడా జనాభాలో 2 శాతం వరకు, అంటే సుమారు 7.7 లక్షల మంది సిక్కులున్నారు. కాలక్రమంలో అక్కడి రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. ఇద్దరు సిక్కులు ట్రూడో మంత్రివర్గంలో సభ్యులుగా ఉండటమే ఇందుకు నిదర్శనం. దేశ దేశాల్లో ప్రవాస భారతీయులు, భారత సంతతి ప్రజలు రాజకీయంగా కీలక స్థానాల్లోకి ఎదగడం కొత్తేమీ కాదు. అగ్రరాజ్యం అమెరికాలో భారతీయ మూలాలు కలిగిన కమలా హ్యారిస్ ఉపాధ్యక్షురాలిగా గెలిచి ఇప్పుడు అధ్యక్ష పదవికి పోటీ పడటం మనం చూస్తున్నాం. కానీ, కెనడా విషయం వేరు. అక్కడి సిక్కుల్లో ఖలిస్థానీ వేర్పాటువాదులు కూడా ఉన్నారు. వారు కెనడా గడ్డపై నుంచి భారత వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అక్కడి ప్రభుత్వం వారికి ఆశ్రయం కల్పించి పరోక్ష మద్దతు అందిస్తున్నది. సుమారు నలభై ఏండ్ల కిందట కనిష్క విమానం పేల్చివేత మొదలుకొని ఇటీవలి కాలంలో దౌత్య కార్యాలయాలపై దాడుల దాకా భారత్ లక్ష్యంగా జరిగిన అనేక హింసాత్మక దాడులతో కెనడాలోని సిక్కు ఖలిస్థానీవాదులకు సంబంధాలున్నాయనేది బహిరంగ రహస్యమే. ఉగ్రవాదిగా భారత్ ప్రకటించిన నిజ్జర్ గతేడాది జూన్‌లో కెనడాలోనే హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు భారతే కారణమని కెనడా ఆరోపించింది. ఆధారాలుంటే చూపాలని భారత్ అంటుంటే, ఈసరికే బోలెడు ఆధారాలు చూపామని కెనడా వాదిస్తున్నది.

వచ్చే ఏడాది జరుగనున్న ఎన్నికల్లో గెలుపు మీద దృష్టితోనే ప్రధాని ట్రూడో ఈ హత్యను రాజకీయం చేస్తున్నారనే విమర్శలు బలంగా వినవస్తున్నాయి. ఇప్పుడు భారత విదేశాంగ శాఖ అదే అంటున్నది. జనామోదంలో 31 శాతానికి పరిమితమైపోయి వెనుకబడిన ట్రూడో నిజ్జర్ అంశాన్ని తలకెత్తుకోవడం వెనుక కారణాల గురించి తలబద్దలు కొట్టుకోవాల్సిన అవసరం లేదు. ఖలిస్థాన్ సమర్థకుడైన జగ్మీత్‌సింగ్ నేతృత్వంలోని న్యూ డెమొక్రటిక్ పార్టీ గత వారమే ట్రూడో సర్కార్‌కు మద్దతు ఉపసంహరించింది. ఈ నేపథ్యంలో తన ఓటు బలం పెంచుకునేందుకు ఖలిస్థానీయుల మెప్పు కోసం ప్రధాని ట్రూడో భారత్‌పై విమర్శలు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. సంకుచిత రాజకీయ ప్రయోజనం కోసం భారత్ వంటి దేశంతో సంబంధాలను బలిపెట్టడం వాంఛనీయం కాదు.

# అడుసు తొక్కనేల కాలు కడుగనేల

రాజకీయాల్లో ప్రత్యర్థులను లక్ష్యంగా చేస్తూ మాట్లాడటం కొత్త కాదు. కానీ, పరిమితులను అతిక్రమించినప్పుడే వివాదాలు తలెత్తుతున్నాయి. ఇటీవల ప్రముఖ సినీహీరో నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే అందుకు ఉదాహరణ.



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238



ఒకప్పుడు రాజకీయాల్లో ఆరోపణలు చేయాలన్నా ఆచి తూచి వ్యవహరించేవారు. ప్రత్యర్థుల సిద్ధాంతాలు, విధానాలను విమర్శించడం తప్ప వ్యక్తిగత జీవితాలను, కుటుంబాలను రచ్చకీడ్చేవారు కాదు. కానీ, వర్తమాన సమాజంలో ఆ దృశ్యం అంతర్ధానమైంది. లాగుల్లో తొండలు వదలడాలు, పండబెట్టి తొక్కి పేగులు మెడలో వేసుకోవడాలు, అక్రమ సంబంధాలు అంటగట్టడాలు, వ్యక్తిగత అలవాట్లను వెక్కిరించడాలు రాజకీయ నాయకులు ప్రయోగించే ఊత పదాలైపోయాయి. పార్టీ వేదికా? ప్రభుత్వ వేదికా? అన్న తేడా లేకుండా తిట్ల పురాణ ప్రవచనాలు నిత్యకృత్యమైపోయాయి. అది అంతటితో ఆగిందా సంస్కార హీనమైన, అమానవీయమైన వ్యాఖ్యల ప్రకంపనలు రాజకీయాలకు సంబంధం లేని కుటుంబాలను, మహిళలనూ తాకుతుండటమే ఆక్షేపణీయం.

> **మొన్నటికి మొన్న రాష్ట్ర అసెంబ్లీలో సబితా ఇంద్రారెడ్డి, సునీతారెడ్డి పట్ల అధికార పార్టీ వ్యవహరించిన తీరు ఇంకా జ్ఞాపకాల ఫలకం మీద చెరిగిపోలేదు. పురుషాధిక్య సమాజంలో మహిళలు రాజకీయాలు సహా ఏ రంగంలోనైనా నిలదొక్కుకోవడం అంత సులభం కాదు. అయితే, మహిళలకు మహిళలే ప్రత్యర్థులుగా మారి పరువును మంట కలుపుతుంటే ఇక రక్షించేదెవరు. కొండా సురేఖ ఆ విచక్షణ మర్చిపోయి నోరు జారి భంగపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ దూషణ నిందారోపణ పర్వాన్ని కేసీఆర్ ప్రారంభిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నాడని మోకాలుకు, బోడి గుండుకు ముడివేసే వ్యాఖ్యలు చేశారు.**

బీజేపీ నేతలు తరచుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వివాదాల్లో తలదూర్చి కాంగ్రెస్‌ను పరదా వెనక్కు నెట్టి, కేసీఆర్ దోషి అన్నట్టుగా తీర్పులు చెప్తున్నారు. ఇటీవల హరీశ్‌రావు ఒక పత్రికలో రేవంత్‌రెడ్డి తిట్ల పురాణాన్ని వ్యాసంగా రాస్తే... బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఇన్‌ప్లీడై 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అంటూ ప్రధానంగా కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ అదే పత్రికలో వ్యాసం రాశారు. కేసీఆర్ ప్రయోగించిన భాషను వేలెత్తి చూపుతూ, కాంగ్రెస్ నేతలు ప్రయోగిస్తున్న భాషను పరోక్షంగా బీజేపీ నేతలు వెనుకేసుకొచ్చారు. వాస్తవానికి కేసీఆర్ ఏనాడూ ప్రత్యర్థుల కుటుంబాలను రచ్చకీడ్వలేదు. జుగుప్సాకరమైన పద ప్రయోగాలు చేయలేదు. తెలంగాణ పలుకుబడులు, జాతీయాలు, గ్రామీణ పద బంధాలు ఉపయోగించారు. పద్యాలు ఉటంకించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, తదనంతరం సొంత రాష్ట్రానికి హక్కుగా రావలసిన, న్యాయమైన వాటాల కేటాయింపుల కోసం కొట్లాడిన సందర్భంలో అనివార్యంగా కొంత కోపంగా మాట్లాడింది వాస్తవమే. అది ధర్మాగ్రహమే తప్ప, అవతలి వ్యక్తుల హననం కాదు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటిష్ పాలకులను తెల్లోల్లు, బొల్లి గద్దలు అంటే ఆ మాటలను బాడీ షేమింగ్‌గా ప్రజలు భావించలేదు. నిజాం వ్యతిరేక పోరాటంలో కవులు నిజాం రాజును ముసలి నక్క అన్నా, మేడను పడదోస్తాం-మెడనే విరిచేస్తాం అన్నా, తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలలో వ్యతిరేక శక్తులపై ఉద్యమకారులు కవులు ప్రయోగించిన భాషను దూషణగా కాక ధర్మాగ్రహ వ్యక్తీకరణగానే ప్రజలు భావించారు. కారణం వాటివెనుక ఒక ప్రజా ప్రయోజనం, ఉద్యమ స్ఫూర్తి, ఆకాంక్షలు ఇమిడి ఉన్నాయి. వ్యక్తులను బట్టి, స్థలకాలాలు, సందర్భాలను బట్టి తిట్టు స్వభావం, విలువలు మారిపోతుంటాయి. అవి నిఘంటువులకు అందవు. కేసీఆర్ భాషణలూ అంతే. ఆయనది విలక్షణమైన డిక్షన్. అది అనితర సాధ్యం. అయినా, కాంగ్రెస్ నేతలు తమ పలుకు ప్రల్లదనాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ మాటలను ముందుకు తెచ్చినప్పటికీ ప్రజలు ఆమోదించలేదు. కేసీఆర్ పాతికేండ్ల పద ప్రయోగాలకు, ప్రసంగశైలికి కాంగ్రెస్ నేతల దిగజారుడు మాటలకు పోలికే లేదు.

ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో ఆగ్రహించిన భీముడు దుర్యోధన దుశ్శాసనులను తిట్టినదానికి, రాజసూయ యాగంలో కులవివక్షతో శిశుపాలుడు శ్రీకృష్ణుడిని తిట్టినదానికి తేడా లేదా. రెండు ఒకే గాట కడితే ఎట్లా? మహా మహా భక్తులు సైతం కొన్ని సందర్భాల్లో ఏకంగా దేవుళ్లనే తిట్టిపోశారు. అన్నీ భక్త్యావేశాలే. వాటి వెనక ఒక ఉదాత్తమైన అంశం ఇమిడి ఉన్నప్పుడు సమాజం ఆమోదించింది. ఏదో ఒక తొందరపాటు క్షణంలో మహామహులే నోరు జారి వెనక్కి తీసుకున్న సందర్భాలు రాష్ట్ర దేశ రాజకీయాలలో కోకొల్లలు. అది వేరు. వాలాయించి క్రూర దూషణలు, నిందారోపణలు, అస భ్య పద ప్రయోగాలు అదేపనిగా చేస్తున్న కాం గ్రెస్ నాయకులతోనే సమాజం కలుషితమవుతున్నది. ఈ తేడాను బీజేపీ నేతలు గమనించాలి.

> **లేని పోని ఆరోపణలు చేయడానికి, అక్రమ సంబంధాలు అంటగట్టడానికి, కుటుంబాల పరువు బజారుకీడ్వడానికి, పుకార్లు, అనుమానాలు, అపోహలు సృష్టించడానికి గతంలో కొన్ని నాసిరకం పత్రికలు ప్రత్యేకంగా ఉండేవి. పైశాచిక ఆనందం కోసం వాటిని ఆసక్తితో చదివే పాఠకులూ కొందరు ఉండేవారు. సోషల్ మీడియా అనే ఐదవ స్తంభం అవతరించాక ఆ వెర్రి వేయి విధాలుగా విస్తరించింది.**

వాస్తవానికి ఎవరైనా తన అభిప్రాయాన్ని వెల్లడించడానికి, పది మందితో పంచుకోవడానికి, చర్చలకు, అభిప్రాయ సేకరణకు, ప్రతిభా పాటవ ప్రదర్శనలకు అద్భుతమైన వేదిక సోషల్ మీడియా. కానీ, కొంతమంది సంస్కారహీనులు ఆ వేదికపై విచ్చలవిడిగా విహారం చేస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. రాజకీయాల్లో లేని పోని అబద్ధాల ప్రచారానికి.. అపోహలు, భయాందోళనల కల్పనకు.. ఎన్నికలను ప్రభావితం చేయడానికి సోషల్ మీడియాను ఉపయోగించుకునే మాఫియా డాన్లు దేశ స్థాయిలో వీవీఐపీలుగా ప్రాచుర్యం పొందారంటే, ప్రభుత్వాలను శాసించగలుగుతున్నారంటే అది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక 'కొనుగోలు'కు అమ్ముడు పోవడం విషాదం. ఒకరిద్దరు సోషల్ మీడియా పోకిరీల వికృత వ్యాఖ్యలకు మంత్రి స్థాయిలో ఉన్నవారైనా బాధపడటం సహజమే. కానీ, సంబంధం లేని ప్రముఖులపై అంతకంటే బాధ కలిగించే తీవ్రాతి తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం తగని పని. జరగాల్సిన నష్టం జరిగాక ఎన్ని క్షమాపణలు చెప్పి నా అవి ఎంతో కొంత విష ప్రభావం చూపక మానవు. ఒక బుద్ధిహీనుడి నీలాపనింద రామాయణ కథ విషాదాంతానికి దారితీసింది.



ఢిల్లీ పీఠంపై కాంగ్రెస్, బీజేపీ.. ఏ పార్టీ ఉన్నా దేశంలోని ప్రజాస్వామ్యవాదులపై వాటిది ఒకే రకమైన కన్నెర్ర చూపు. ఏ మూలన రాజ్యాంగం, హక్కులు అని నోరెత్తినా ఆ గొంతును శాశ్వతంగా నులిమేసే ప్రయత్నమే చేస్తున్నాయి. అకారణంగా కఠిన చట్టాలను వారిపై ప్రయోగించి జైళ్లలో క్రూర హింసల పాలు చేసి తమ కసిని తీర్చుకుంటున్నాయి. అందుకు నిలువెత్తు సాక్ష్యమే జీఎన్ సాయిబాబా జీవితం.

# పదేండ్లు జైల్లో ఉన్న నిర్దోషి



నర్సన్ బద్రి
94401 28169

శారీరకంగా 90 శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబా గత పదేండ్లుగా దేశంలో సాగుతున్న దుర్మార్గ పాలనకు బలయ్యారు. ఈ నెల 12న హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో ఆయన తుది శ్వాస విడిచారు. జైల్లో అధికారులు ఆయన ఆరోగ్యం పట్ల చూపిన నిర్లక్ష్యమే సాయిబాబా ప్రాణం తీసింది. జైలు గోడల మధ్య 'నేను చావును ఎదిరిస్తున్నాను' అన్న ఆయన జైలు బయటే మరణించారు. తొమ్మిదేండ్ల పాటు నాగపూర్ జైల్లోని అండా సెల్ తనను వేపుకు తిన్నా మరణంలో తన పంతాన్ని నెగ్గించుకున్నారు. తన వేదనను కవిత్వం ద్వారా, ఉత్తరాల ద్వారా లోకానికి తెలియజేశారు. 'నేను చనిపోయేలా ఏం చేయాలో వారికి తెలియదు/ ఎందుకంటే నాకు మొలకెత్తే గడ్డి సవ్వడులంటే చాలా ఇష్టం' అని రాశారు.

పోలియో వ్యాధి వల్ల కాళ్లు చచ్చుబడిపోయినా, సాయిబాబా శరీరాన్ని ఈడ్చుకుంటూ యూనివర్సిటీల మెట్లెక్కి ఉన్నత చదువులు అందుకున్నారు. ఇంగ్లీష్‌లో పీహెచ్‌డీ చేసి ఢిల్లీలోని కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశా రు. 2014, మే 9 నాడు కాలేజీ నుంచి ఇంటికి వస్తుండగా పోలీసులు ఆయనను గడ్చిరోలికి తీసుకువెళ్లారు. ఉపా చట్టం కింద కేసు పెట్టి నాగపూర్ సెంట్రల్ జైలుకు పంపి, సర్వదా పోలీసుల నిఘా ఉండే ఎలుకల బోనులాంటి అండా సెల్‌లో వేశారు. అంగవైకల్యం కారణంగా ఆయనను నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలని ఎన్ని విన్నపాలు చేసినా ఫలితం రాలేదు. ప్రభుత్వం పన్నిన భారీ కుట్రలో భాగంగా ఒక కోర్టు బెయిల్ ఇవ్వగానే మరో కోర్టు దాన్ని రద్దుచేసేది.

ప్రభుత్వాన్ని కూల్చివేసే కుట్రలో సాయిబాబా భాగమయ్యారని 2017లో గడ్చిరోలి సెషన్స్ కోర్టు ఆయనకు జీవితఖైదు శిక్ష వేసింది. ఈ తీర్పును సమీక్షించాలని ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఐదేం డ్ల తర్వాత ఆయన పిటిషన్ బెంచిపైకి వచ్చింది. ఈ కాలం ఆయన అదే జైల్లో దుర్భర జీవితం గడపక తప్పలేదు. 2022లో బాంబే హైకోర్టు.. గడ్చిరోలి సెషన్స్ కోర్టు విధించిన జీవితఖైదు తీర్పును కొట్టివేసి సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది. ఆ మర్నాడే పునర్విచారణ పేరిట హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేసింది. మళ్లీ విచారణ మొదలైంది. మరో రెండేండ్ల పాటు అండా సెల్ నరకం కొనసాగింది. చివరికి బాంబే హైకోర్టు 2024, మార్చి 5 నాడు సాయిబాబాను మళ్లీ నిర్దోషిగా ప్రకటించింది. ఎట్టకేలకు మార్చి 6 నాడు జైలు జీవితం నుంచి ఆయనకు విముక్తి లభించింది.

పోలీసులు పట్టుకెళ్లిన నాటి నుంచి విడుదలయ్యేదాకా మావోయిస్టులతో తనకు ఎలాంటి సంబంధాలు లేవని సాయిబాబా చెప్తూనే ఉన్నారు. ఆయన మాట నిజమని తేల్చడానికి చట్టానికి పదేండ్లు పట్టింది. చేయని నేరానికి ఎన్ని తిప్పలు పడ్డా బెయిల్ దొరకలేదు. క్యాన్సర్ వ్యాధి బారినపడి చికిత్స పొందుతున్న తల్లిని చూడటానికి అనుమతించలేదు. కొడుకును చూడకుండానే 2020 ఆగస్టు 1న ఆ తల్లి కన్నుమూసింది. చివరి చూపు కూడా ఆయనకు దక్కలేదు. తల్లి అంత్యక్రియల హాజరుకు పెట్టుకున్న పెరోల్ మంజూరు కాలేదు. రాజకీయ పెద్దలైన శరద్ పవార్, సీహెచ్ విద్యాసాగర్‌రావు లాంటి వారి మాటలు కూడా పనిచేయలేదు. ప్రపంచ మానవ హక్కుల సమాజాలు, ఐక్యరాజ్యసమితి అభ్యర్థనలను ప్రభుత్వాలు ఖాతరు చేయలేదు. భారత, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఆయన పట్ల కనీస మానవతా దృక్పథం చూపించలేదు. జైల్లో తానెలా ఉండేదీ, తన ఆరోగ్యం ఎలా దెబ్బతిన్నదీ మొదలైన విషయాలు సాయిబాబా పత్రికల్లో వివరించారు. అండా సెల్‌లో 14 నెలలు గడిపిన తర్వాత అక్టోబర్ 2015లో రాసిన వ్యాసంలో ఆ సమ యం 14 ఏండ్లుగా అనిపించిందన్నారు. తాను మరో వంద నెలలు అక్కడే ఉండవలసి వస్తుందని అప్పటికి ఊహించి ఉండరు. 8 నెలల తర్వాత వెస్టర్న్ కమోడ్ ఏర్పాటుచేశారు. అది కూడా సరిగ్గా పనిచేసేది కాదు. రోజుకు ఒక బకెట్ నీళ్లు మాత్రమే లభించేవి. తనకు వెన్నుపాములో సమస్య ఉందని తెలిసినా పోలీసులు తన చేతులు పట్టుకొని లాక్కుపోయేవారని, దాని వల్ల ఎడమవైపు శరీరం పనిచేయడం మానేసిందని రాశారు. సరైన వైద్యం చేయించకుండా పెయిన్ కిల్లర్స్ ఇచ్చేవా రు. దానివల్ల శరీరం మరిన్ని రోగాలకు నిలయమైంది. జైల్లోకి వెళ్లేముందు కాళ్లు పనిచేయకపోవడం తప్ప తన కు ఏ అనారోగ్యం లేదు. ఎప్పటికప్పుడు వైద్యం అందిస్తే ఆరోగ్యం ఇంతగా దెబ్బతినేది కాదన్నారు.

మార్చి 9న విడుదలైన తర్వాత ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'మీ ముందు సజీవంగా కనబడుతున్నాను కానీ, నా శరీరంలోని అవయవాలన్నీ పాడైనాయి' అన్నారు. ఆ మాటన్న 7 నెలలకే, 57 ఏండ్ల వయసులో సాయిబాబా జీవితం ముగియడం విషాదకరం. తాను కోల్పోయిన జీవితానికి ఫలితం దక్కకుండానే నిష్క్రమించడం బాధాకరం. తెలంగాణవాది అయి న సాయిబాబా మరణం పట్ల నేటి కాం గ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శించింది. గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి కోసం ఆయన పార్థివదేహాన్ని ఉంచేందుకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. కనికరం లేని ప్రభుత్వాల పాలనలో ముగిసిపోయే ప్రజాస్వామ్య యోధుల జీవితాలు ప్రజలను తప్పక చైతన్యపరుస్తాయి.

# 'హైడ్రా' బాధితుల గోడు వినేదెవరు?



గోపాల బాలరాజు
73370 82570

'హైడ్రా అంటే భవిష్యత్తుకు భరోసా. హైడ్రాపై లేనిపోని భయాలు పెట్టుకోవద్దు. పేదలు, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం చేయం. పేదల నివాసాలుంటే వాళ్లకు టైం ఇచ్చాకే కూల్చుతున్నాం' - హైడ్రా కమిషనర్ రంగనాథ్.

కష్టం చేసి.. రూపాయి, రూపాయి కూడబెట్టుకొని కొనుక్కున్న ఇండ్లు, అపార్టుమెంట్లను కండ్లముందే 'హైడ్రా' కూల్చేస్తుంటే, అసలు భవిష్యత్తు అనేదే లేకుండా పోయిన తర్వాత ఇక భరోసా కల్పించేదెవరికని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేని కట్టడాలుంటే వాటిని కూల్చాల్సిందే. కానీ, ప్రభుత్వ అనుమతులు తీసుకొని పేద, మధ్యతరగతి ప్రజలు కట్టుకున్న ఇండ్లు, అపార్టుమెంట్లను అకస్మాత్తుగా హైడ్రా పేరుతో కూల్చివేయడం ఎంతవరకు సమంజసం?

ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే దానికి విరుద్ధంగా రాష్ట్రంలోని ప్రజల ఆస్తులను కూల్చుతున్న ది. అసలు తప్పు చేసిందెవరు? ప్రభుత్వం చెప్తున్నట్టుగా సదరు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ తదితర నిషేధిత, ప్రభుత్వ స్థలాలను రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు, వీరితోపాటుగా సదరు స్థలాలకు నిర్మాణ అనుమతులిచ్చిన మున్సిపల్ శాఖల ప్రభుత్వ అధికారులే కదా. మరి తప్పు చేసిన వారిని వదిలేసి, ఎలాంటి తప్పూ చేయని అమాయక ప్రజల ఇండ్లను, అపార్టుమెంట్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తూ, అమాయక ప్రజలకు శిక్ష విధించడం ఏమిటి? తప్పు చేసిన అధికారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? సంబంధిత కొంతమంది అధికారుల మీద ఏదో తూతూ మంత్రంగా కేసులు పెట్టారు.

ఇటీవల హైడ్రా కూల్చివేసిన ఒక స్థలం, అందులోని నిర్మాణం 30 ఏండ్ల కిందట సేల్ డీడ్ అయింది. ఆ పత్రాలు సమర్పించాకే ప్రభుత్వం అన్ని అనుమతులిచ్చింది కదా? అసలు ప్రభుత్వం చెప్తున్నట్టు అది నిషేధిత స్థలమే అయితే, దాన్ని సేల్ డీడ్ ఎట్లా చేసినట్టు? ఆ స్థలంగానీ, అందులో కట్టిన నిర్మాణాలుగానీ 30 ఏండ్లలో ఏడెనిమిది మంది చేతులు మారాయనుకుందాం. ఇన్నేండ్లుగా ఆ రిజిస్ట్రేషన్ ట్రాన్సాక్షన్లపై ప్రభుత్వానికి సదరు ఆస్తి విలువలో కనీసం సగం ఆదాయం స్టాంపు డ్యూటీ ద్వారా వచ్చినట్టే కదా? ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల మధ్య జరిగిన ఆస్తి క్రయవిక్రయాల విషయంలో దాని టైటిల్‌ను పరిశీలించే బాధ్యత రిజిస్ట్రార్‌పై అంతగా ఉండదు. కేవలం సదరు ఆస్తి విలువకు ప్రభుత్వ లెక్కల ప్రకారం స్టాంపు డ్యూటీ వచ్చిందా! లేదా? అని మాత్రమే చూస్తారు. అయితే, ప్రభుత్వ ఆస్తుల క్రయవిక్రయాల విషయంలో సదరు ఆస్తి నిషేధిత జాబితాతో పోల్చుకొని రిజిస్ట్రేషన్లు కాకుండా చూసి, పరిరక్షించాల్సిన బాధ్యత సదరు రిజిస్ట్రారుదే. ప్రభుత్వ స్థలాలను అమ్మకుండా అడ్డుకొని, వాటిని పరిరక్షించాల్సింది కూడా ప్రభుత్వ అధికారులే కదా? అక్రమ లే ఔట్లు అయితే రిజిస్ట్రేషన్లు కావు. సక్రమైనవి మాత్రమే అవుతాయి. మరి సక్రమ లే ఔట్లలోని నిర్మాణాలను కూడా ఎందుకు కూలగొడుతున్నట్టు? వీటన్నింటికీ సమాధానం చెప్పవలసింది ప్రభుత్వమే కదా?



వీటిపై హైడ్రా ఏం చెప్తున్నదంటే.. అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారులు సస్పెండయ్యారట, రిజిస్ట్రేషన్లూ రద్దయ్యాయట. కానీ, ఆయా వివరాలడిగితే మాత్రం ఏమీ చెప్పరట. ఇదెక్కడి చోద్యం? ఇదేనా ప్రభుత్వ జవాబుదారీతనం? పారదర్శకత ఏమైనట్టు? హైకోర్టు నోటీసులిస్తున్నా హైడ్రా పేరుతో రొడ్డకొట్టుడుగా కొట్టుకుంటూ పోవడమే గానీ, నిరాశ్రయులైన బాధితులకు కనీసం పునరావాసం కల్పించారా, అంటే అదీ లేదు. ఉన్నపళంగా తాము నివసిస్తున్న ఇండ్లు కూల్చివేయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు పిల్లాపాపలతో సహా రోడ్డున పడ్డారు. దీంతో గుండె పగిలి చావాల్సిన దుస్థితి ఏర్పడింది. తప్పు చేసిన అధికారులను స్వేచ్ఛగా వదిలేసి, ఏ తప్పూ చేయని అమాయక ప్రజలను నిర్బంధించి, అభివృద్ధి పేరిట కండ్లెదుటే కూల్చివేతలు సాగిస్తుంటే.. ప్రజా వ్యతిరేకత గాక మరేం వస్తుందో పాలకులకే తెలియాలి. మూసీ రివర్ ఫ్రంట్ అంటున్నారు సరే, ఆ మూసీ పరిరక్షణ కోసం నది పొంగకుండా మూసీని లోతుగా తవ్వించవచ్చు. వరద నీరు రాకుండా పటిష్ఠమైన గోడ కూడా కట్టుకోవచ్చు. డ్రైనేజీ ఇంకా లోతుగా తవ్వి డ్రిల్స్ పెట్టి నీళ్లు పారే ఏర్పాట్లు చేయవచ్చు. అంతేకానీ, నిర్మాణాలను కూల్చుకుంటూ పోవడమే పరిష్కారం కాదు. ప్రభుత్వం పరిష్కార మార్గాలను అన్వేషించాలి కానీ, కష్టపడి కట్టుకున్న పేదల ఇండ్లు కూలగొట్టడం సరికాదు.




## ఎగ్జిట్ పోల్స్ ఎందుకు?



దృష్టి మళ్లించేందుకు మాత్రమే ఎగ్జిట్ పోల్స్ పనికివస్తున్నాయి. ఆ పోల్స్ ఫలితాలను వెల్లడించే ముందు మీడియా దీనిపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. లెక్కింపు రోజు ఎర్లీ ట్రెండ్స్, లీడ్స్ వెల్లడించాల్సిన అవసరం గురించి కూడా మీడియా ఆలోచించాలి.

- రాజీవ్ కుమార్, ప్రధాన ఎన్నికల కమిషనర్